నిషేధం.. మూన్నాళ్ల ముచ్చటేనా!

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు. ప్రజారోగ్యానికి చేటు. మూగ జీవాలపాలిట మృత్యువు. అలాంటి పాలిథిన్‌పై విధించిన నిషేధం ప్రకటనలకే పరిమితమవుతోంది. ప్లాస్టిక్ వినియోగాన్ని విడిచి పెట్టాలని అధికారులు ప్రచారంతో సరిపెట్టడంతో కథ మళ్లీ మొదటికే వస్తోంది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి సంపూర్ణంగా పాలిథిన్‌పై నిషేధం విధించారు. ఆ మేరకు అధికారులు చర్యలు కూడా చేపట్టారు. అయితే అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది. యథేచ్ఛగా పాలిథిన్ వినియోగం సాగుతోంది.


ప్లాస్టిక్ కవర్లు తింటున్న మూగ జీవాలు


పండ్లకూ పాలిథిన్ కవర్లే..

యథేచ్ఛగా పాలిథిన్ వినియోగం

ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు

నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు

అధికారుల చర్యలు నామమాత్రం

ప్లాస్టిక్ నిషేధం పై అధికారుల చర్యలు నామమాత్రంగా ఉండడంతో విచ్చలవిడిగా వాటి విక్రయాలు సాగుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలో అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారని వాపోతున్నారు.


వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లు

పెదగంట్యాడ: ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పామని అటు ప్రభుత్వం.. ఇటు అధికారులు ప్రకటించారు. అయినా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను, పాలిథిన్ సంచులు, గ్లాసులను మార్కెట్లో విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ మనం చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా.. ఇంటికి సరకులు తీసుకురావాలన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా ప్రజలు మారడం లేదు.

పెరుగుతున్న వ్యర్థాలు

పాలిథిన్ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రతి రోజూ మండలంలో సుమారు రెండు నుంచి మూడు టన్నుల వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నట్టు అంచనా. 40 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై నిషేధం విధించారు. వాటిని విక్రయించిన వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం కొంత వరకూ తగ్గింది. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమక్రమంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం మళ్లీ పెరిగిపోయింది. కూరగాయలు, మాంసం దుకాణాలు, హోటళ్లు, బేకరీలు, కర్రీ పాయింట్లు, వైన్ షాపుల్లో, బార్లు వద్ద, శుభ కార్యాల విందుల్లో పాలిథిన్ వాడకాలు కనిపిస్తున్నాయి. వినియోగించిన తర్వాత ఆ వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో పడేస్తున్నారు. ఆయా వ్యర్థాలను పశువులు తినడంతో మృత్యువాత పడుతున్నాయి.

పట్టించుకోని వ్యాపారులు

వ్యాపారులు కూడా ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. పెద్ద పెద్ద మాల్స్ వరకు ఎక్కడ చూసిన ప్లాస్టిక్ కవర్లలోనే అమ్మకాలు చేస్తున్నారు. నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి..


ప్లాస్టిక్ కవర్‌లో పండ్లు తీసుకువెళ్తున్న మహిళ


ప్లాస్టిక్ కవర్‌లో మొక్క జొన్నలు

మూగజీవాలు విలవిల

మిగిలిపోయిన ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లతో పడేస్తున్నారు. దాన్ని మూగజీవాలు తినడంతో కడుపులోకి ప్లాస్టిక్ వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. మరో వైపు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.

నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి



ప్లాస్టిక్ కవర్ల వాడాకాన్ని పూర్తి స్థాయిలో నిర్మూలన చేసే దిశగా ప్రభుత్వాలు, అధికారులు చర్యలు చేపట్టాలి. వాటిని పూర్తిగా అరికట్టాలంటే వాటిని తయారు చేసే పరిశ్రమలను మూసేయాలి. అలాగే ప్లాస్టిక్ వినియోగిస్తే కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.ప్రజలు కూడా ఇలా విషయాల్లో యంత్రాంగానికి సహకరించాలి.

– కొండకంచి రాజు, పర్యావరణ ప్రేమికుడు, నడుపూరు

విచ్చల విడిగా పాలిథిన్ వినియోగం



మండలంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. టీ దుకాణాల వద్ద, హోటల్స్ వద్ద వేడి పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేస్తున్నారు. అలా చేయడం వల్ల ప్లాస్టిక్ కరిగి అవి తాగినా, తిన్నా క్యాన్సర్ బారిన పడుతున్నారు. అప్పుడప్పుడు జీవీఎంసీ అధికారుల వచ్చి తూతూ మంత్రంగా కేసులు రాస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని కింద స్థాయి అధికారులు చిరు వ్యాపారుల వద్ద అందినకాడికి దోచుకుంటున్నారు. ప్లాస్టిక్ నిషేధం పై అధికారుల పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలి..

– గొందేశి పెంటమ్మ, నెల్లిముక్కు

ప్రజలు సహకరించాలి



గాజువాక జోన్ పరిధిలో 2025 జనవరి 1 నుంచి ఇప్పటివరకూ పలు సంస్థల్లో 1247 కేజీల నిషేధత ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను సీజ్ చేశాం. తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నాం. అయినప్పటికీ అక్కడక్కడ ప్లాస్టిక్ వినియోగం కనిపిస్తోంది.వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం.. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలు కూడా సహకరించాలి.

–డాక్టర్ కిరణ్ కుమార్, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్–6

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు


పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ వివేకానందరావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వివేకానందరావు తెలిపారు. కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు.

ఉమారామలింగేశ్వరునికి ఊయల వితరణ


ఆలయ కమిటీ సభ్యులకు ఊయల అందజేస్తున్న దాతలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి దూడ సోమనాథ్, త్రివేణి దంపతులు ఊయలను బహూకరించారు. ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ, ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందించారు. ప్రత్యేక సేవలకు వినియోగించనున్నట్టు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం


ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు సోమవారం రాత్రి ఎంపీ ఎం. శ్రీభరత్ కలిసి కోరారు. 45 ఏళ్లు దాటిన కార్మికులను మెడికల్ టెస్టులు పేరుతో తొలగిస్తున్నారన్నారు. మెడికల్ టెస్టులు రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను చేర్చుకునేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నమ్మి రమణ, సోమబాబు, కె. వేణుగోపాలరెడ్డి, యు. అప్పారావు, డి. ఆనంద్ పాల్గొన్నారు.

జీఎం దృష్టికి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు


స్టీల్‌ప్లాంట్ జీఎం భానును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ బీఎంఎస్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కోరారు. సోమవారం వారు స్టీల్‌ప్లాంట్ ప్లాంట్ పర్సనల్ జీఎం ఎస్. భానుకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. అలాంటి వారిని తొలగించడం వల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడతాయని వివరించారు. కార్మికుల్లో అనేక మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల గురించి యోచించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమెను నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మద్దాల పెంటారావు, గొందేశి గురప్ప, ఎం.వి.ఎస్.నాయుడు, ఎం. రామస్వామి, జెర్రిపోతుల రమణ, పెద్దాడ శంకర్, సంతోష్ , గోపిరెడ్డి, నమ్మి చిన్నారావు, చేపల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌లో విద్యార్థుల స్విమ్మింగ్


ట్యాంక్‌కువేసిన తాళం

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీకాలనీలోని వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి మూతను తొలగించి స్థానికంగా ఉన్న చిన్నారులు అందులోకి దిగి స్విమ్మింగ్ చేస్తున్నారు. అలా చిన్నారులు సోమవారం ట్యాంక్‌లో దిగి అందులోకి ఈత కొడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దీంతో అప్రమత్తమైన జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏఈ కేదార్ నాథ్ వెంటనే సిబ్బందిని పంపించి ట్యాంక్‌ను శుభ్రం చేయించి తాళం వేయించారు.

సమస్యలు పరిష్కరించాలని ఉక్కు కార్మికుల ధర్నా


స్టీల్ మెల్ట్ షాప్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ప్లాంట్‌లోని అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటికే సిబ్బంది తక్కువగా ఉండటంతో పని భారం పెరుగుతుందన్నారు. వెంటనే కొత్త నియామకాలు చేపట్టాలన్నారు. ఉద్యోగులకు వేతన సవరణ చేయడంతో పాటు ఇప్పటికే నిలిపివేసిన హెచ్ఆర్ఏను పునరుద్ధరించాలని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు పి.వి. రమణమూర్తి, బి.ఎస్. రాజు, ఎస్.ఎ. నాయుడు, మద్ది అప్పలరాజురెడ్డి, మిండి దేవుడు, ప్రభాకరరెడ్డి, వెంకన్న, కొమ్ము ప్రసాద్, గోపాలరాజు, పి.వి. నగేష్, పోతారెడ్డి, మొల్లి ఈశ్వరరావు, సుబ్బారావు, దుర్గాప్రసాద్, మధు, ఎం. ప్రసాద్, లోకేష్, ఎస్.ఎస్. రెడ్డి, గోవింద్, హరనాథ్, రమేష్, దిండి మోహన్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం కుదేలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు

పెదగంట్యాడ: ప్రధానిగా నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశం అన్ని రంగాల్లో కుదేలైందని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో సోమవారం వివిధ పోరాటాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు భారీగా పెంచారన్నారు. వీటిపై గత నెల 23 నుంచి ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి వరకూ తమ పార్టీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జి.ఆనంద్, అచ్యుతరావు, దుర్గారావు, విష్ణుమూర్తి, పోతయ్య, వనజాక్షి, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు


నడుపూరు రామాలయంలో శ్రీరాముని పట్టాభిషేకం

పెదగంట్యాడ: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు రామాలయంలో సోమవారం శ్రీరాముడి పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ బదిలీ


అత్తార్ మహ్మద్ హనీఫ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ భిలాయ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దులస్తిలోని డీహెచ్ఈపీ కమాండెంట్ జితేంద్రబాబు దువ్వాడ యూనిట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా రెండేళ్ల కిందట అత్తార్ మహ్మద్ హనీఫ్‌యూనిట్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కిందట ఆయనకు సీనియర్ కమాండెంట్ పదోన్నతి లభించింది. యూనిట్ హెడ్‌గా ఆయన ప్లాంట్ సెక్యూరిటీ కోసం అనేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా అంకిత భావంతో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించారు. ఆయన హయాంలో సిబ్బంది సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు. హనీఫ్ తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ వారంలో ఆయన కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు.

కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో వివిధ కార్పొరేషన్‌ల నుంచి రుణాల మంజూరు కోసం మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి తెలిపారు. 64 నుంచి 79వ వార్డు, 85 నుంచి 88వ వార్డుల పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



సీనియర్ న్యూట్రిషనిస్ట్ శిరీష

అక్కిరెడ్డిపాలెం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 69వ వార్డు శీలానగర్‌లోసోమవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, అప్ కీప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆహారం – ఆరోగ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సీనియర్ న్యూట్రిషనిస్ట్ డి.ఎన్.టి.శిరీష మాట్లాడుతూ వ్యాధి వచ్చినప్పుడు మందులతో పాటు డైట్ పాటిస్తే వ్యాధి తొందరగా నయం అవుతుందన్నారు. మెడిసిన్ కన్నా ఆహారం మంచిదే తీసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తువు అని వివరించారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు వై.సత్యవతి, జి.మణి, గీత, రమణి, జానకి, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.లక్ష్మి, అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.రాజు, కృష్ణ మోహన్, సత్యారావు, సుబ్బరాజు, శ్రీను పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం


డాక్టర్ భారతి, డాక్టర్ ఉషాలను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ప్రాంత వాసులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నామని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ భారతి, ఆర్ఎంవో డాక్టర్ ఉషాలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులు, స్థానికులు, పాలకుల సహకారంతో మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, డొక్కా రమేష్, గంతకోరు అప్పారావు, కసిపల్లి శ్రీనివాసరావు, కోసూరి తాతారావు, బండారు చందు, రవికుమార్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 18 వినతులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 18 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, నీటి సమస్య పరిష్కరించాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కుక్కలు, పందులను నియంత్రించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను జోనల్ కమిషనర్ ఆదేశించారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు


బహుమతులు అందిస్తున్న జేఎన్‌పీసీ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు సోమవారం జేఎన్‌పీసీ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌పీసీ మానుఫాక్చర్స్ అసోసియేషన్ కార్యదర్శి జెట్టి సుబ్బారావు, వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని అలవర్చడం కోసం ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ గుర్రం అప్పలరాజు, ఎర్రా కోటేశ్వరరావు, దాసరి రామారావు పాల్గొన్నారు.